



https://epaper.tharangalu.in

RNI. TELTEL / 2022 / 83463

జాతీయ దిన ప్రతిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
మంగళవారం
08 సెప్టెంబర్ 2026
సంపుటి 03
సంచిక 330
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh

Epaper: www.tharangalu.in.com


## కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర



- బీజేపీ వ్యతిరేక ఓట్లపై ప్రత్యేక నిఘా
- కొడంగల్‌లో 81 వేల ఓట్లు గల్లంతు
- పేదలు, గిరిజనుల ఓట్లపైనా కుట్ర
- దీనిపై లౌకిక శక్తులు ఏకం కావాలి
- సర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్7 తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు. తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు. తెలంగాణలో సర్? ప్రక్రియ మొదలవ్వకముందు ప్రధాన ప్రతిపక్షం మాట్లాడింది. కోటి ఓట్లు తొలగించిన తర్వాత సర్?కు వ్యతిరేకంగా వారు ఒక్కమాట కూడా మాట్లాడటం లేదు. బీజేపీ కుట్రపూరితంగా


➢ మిగతా 2వ పేజిలో..


## అసెంబ్లీ వద్ద రచ్చ..

- సమావేశాల ప్రారంభానికి ముందు ఉద్రిక్తత
- హామీల అమలుపై బీఆర్ఎస్ నేతల నిరసన
- నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి నేతలు
- నినాదాలు, ప్లకార్డులతో మూకుమ్మడి నిరసన
- పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం, తోపులాట
- అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద హరీశ్‌రావును అరెస్ట్
- మరింతగా నెలకొన్న ఉద్రిక్త వాతావరణం
- పోలీసులతో వాగ్వాదంలో కేటీఆర్ కు గాయాలు
- ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డ బీఆర్ఎస్
- పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో కేటీఆర్ ఆగ్రహం
- తోపులాటలో గాయపడ్డ మహిళా ఎమ్మెల్యేలు
- రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు బీఆర్ఎస్ పిలుపు



హైదరాబాద్,సెప్టెంబర్7 తెలంగాణ అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు అసెంబ్లీ ముందు ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన, హామీల అమలుపై నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి రావడం అసలు ఘర్షణకు కారణం అయింది. నినాదాలు, ప్లకార్డులతో వచ్చిన బీఆర్ఎస్ సభ్యులను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావును పోలీసులు అదుపులోకి


➢ మిగతా 2వ పేజిలో..




## త్రివిధ దళాల సామర్థ్యం మరింత బలోపేతం

- 1.10 లక్షల కోట్లతో ఆయుధాలు కొనుగోళ్లు
- అత్యాధునిక ఆరుద్ర రాడార్లుకు ప్రాముఖ్యత
- కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర

న్యూఢిల్లీ,సెప్టెంబర్7 దేశ త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏకంగా 1.10 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో ఆయుధాలు, సైనిక పరికరాల


➢ మిగతా 2వ పేజిలో..


## నియోజకవర్గానికో కోటి!

- ఎంపీలాడ్స్ ఫండ్‌నూ సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యేలు 25 ప్రాధాన్యాంశాలను గుర్తించాలి
- వాటి పరిష్కారానికి పనిచేస్తే గుర్తింపు, గౌరవం
- డబ్బులే ఎన్నికల్లో గెలిపించవు... జనంతో మమేకం కావాలి
- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో చంద్రబాబు పిలుపు



అమరావతి, సెప్టెంబరు 7 నియోజకవర్గాల్లో చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించారు. ఆర్థిక కష్టాలున్నా ప్రతి నియోజకవర్గానికీ కోటి రూపాయల చొప్పున అందిస్తామని ప్రకటించారు. సోమవారం టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో చిన్న సమస్యలనూ పరిష్కరించలేకపోతున్నామని, నిధులు అందుబాటులో ఉంటే బాగుంటుందని అన్నారు. సీఎం స్పందిస్తూ.. ప్రభుత్వం ఇచ్చే నిధులతోపాటు ఎంపీ ల్యాడ్స్ నిధులనూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీలు కూడా వారి పరిధుల్లోని అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రాధాన్యాల వారీగా నిధులు కేటాయించాలన్నారు. ఎమ్మెల్యేలు కూడా లక్ష్యాలు పెట్టుకుని పనిచేయాలని.. ప్రతి నియోజకవర్గంలో 25 ప్రాధాన్యాంశాలను గుర్తించి, వాటి పరిష్కారానికి పనిచేస్తే ప్రజల్లో గుర్తింపు, గౌరవం లభిస్తుందని తెలిపారు. ఒక్కరే పనిచేస్తే ఫలితం ఉండదని, శ్రేణులతో కలిసి సాగితే ప్రజాప్రతినిధుల బలం వందరెట్లు పెరుగుతుందన్నారు. అయితే డబ్బు ఒక్కటే ఎన్నికల్లో గెలిపించదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని సూచించారు. కాంక్లేవ్ తరహా సమావేశాలు ప్రతి 3 నెలలకోసారి నిర్వహిస్తామని, ఈ మూడు నెలల కాలంలో ఏయే ఎమ్మెల్యేలు ఉత్తమ విధానాలు అమలు చేస్తారో.. వచ్చే సమావేశంలో ప్రజెంటేషన్ ఇచ్చేలా వారిని ప్రోత్సహిస్తామని


➢ మిగతా 2వ పేజిలో..




## అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

- తెలంగాణ రాష్ట్ర హైకోర్టు పోలీసులకు ఆదేశం
- ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారు
- రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ

హైదరాబాద్,సెప్టెంబర్7 తెలంగాణ శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసనసభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు


➢ మిగతా 2వ పేజిలో..


## పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నిబంధన

- గ్యాస్ వినియోగదారులకు కేంద్రం తీపికబురు




హైదరాబాద్,సెప్టెంబర్7 వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు అక్కడ 45 రోజుల వ్యవధి ఉండేది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఇక 25 రోజుల నిబంధనే అమల్లో ఉంటుంది. ఈ మార్పును వెంటనే


➢ మిగతా 2వ పేజిలో..




## నష్టాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు


➢ 2వ పేజిలో..


## మ్యాట్రిమోనీ పేరుతో భారీ మోసాలు

**ఫాక్ మ్యాట్రిమోనీతో డబ్బులు వసూలు**

హైదరాబాద్,సెప్టెంబర్7 పెళ్లి కుదరాలి.. పిల్లల జీవితం బాగుండాలి.. అనే తల్లిదండ్రుల ఆశ పడుతుంటారు. తమ స్థాయికి మించి కూడా మంచి సంబంధాల కోసం వెతుకుతుంటారు. బంధువులు తెలిసిన వారితో పాటు ఇటీవల కాలంలో మ్యాట్రీమోనీలను కూడా ఆశ్రయిస్తున్నారు. అయితే తల్లిదండ్రుల ఆశను ఆసరాగా చేసుకుని కొందరు సైబర్ కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా ఇలాంటి ఘటనే నల్గొండ జిల్లాలో వెలుగు చూసింది. మీ అమ్మాయికి పెళ్లి సంబంధం చూస్తున్నారా? పెళ్లి కుదిరిందానండీ.. మాది పలానా మ్యాట్రీమోనీ.. మీ అమ్మాయికి తగిన సంబంధాలు మావద్ద ఉన్నాయి. అబ్బాయి


➢ మిగతా 2వ పేజిలో..

# అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉదంతంపై రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా, మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉదయం అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాల నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నిబంధన

అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ఈ నిబంధనను అమలు చేయనున్నాయి. రీఫిల్ బుకింగ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తేడా ఇక ఉండదు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రీఫిల్ బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయని చెప్పారు. దీంతో 45 రోజుల నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. దీంతో డిమాండ్‌ను నియంత్రించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని కేంద్రం తీసుకొచ్చింది. ఇప్పుడు పరిస్థితి మెరుగుపడటంతో ఆ పరిమితిని తొలగించింది.

## కోటి ఓట్ల తొలగింపునకు కుట్ర

వ్యవహరిస్తున్నప్పుడు ప్రధాన ప్రతిపక్షం ఆ అంశాన్ని లేవనెత్తడం లేదు. 2029లో జరగబోవు ఎన్నికల్లో నరేంద్రమోదీ ఓటమికి ఈ ఓట్లతోనే పునాది పడుతుంది. ఈ ఓట్లు తొలగిస్తే మోదీకి వెయ్యేనుగుల బలం చేకూరుతుంది. ఎన్నికలు ఎప్పుడో ఉన్నాయి అప్పుడు చూద్దామనుకోవద్దు. గెలుపోటములను నిర్ణయించేది ఎస్?ఐఆర్ అని అన్నారు. వ్యవసాయం గురించి సాధికారంగా మాట్లాడగలిగిన వ్యక్తి సారంపల్లి మల్లారెడ్డి అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భూమిలోని సారం నుంచి మొదలుపెట్టి నీరు, విత్తనం, పెట్టుబడి, పంట, గిట్టుబాటు ధర.. అన్ని అంశాలు కూలంకషంగా చెప్పేవారని గుర్తుచేశారు. వ్యవసాయం గురించి అవగాహన కోసం సారంపల్లి మల్లారెడ్డి రాసిన పుస్తకాలు చదివానని తెలిపారు. సారంపల్లి మల్లారెడ్డిని తక్కువసార్లే కలిసినప్పటికీ, ఆయన అంటే అపారమైన గౌరవం ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కమ్యూనిస్టుల పోరాటాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఉపయోగపడ్డాయని చెప్పారు.దున్నేవాడితే భూమి అంటూ ఎన్నో రైతు సమస్యలపై కమ్యూనిస్టులు పోరాడారని రేవంత్ రెడ్డి కొనియాడారు. కమ్యూనిస్టులు అంటే తనకు పరోక్షంగా చాలా అభిమానమని వివరించారు. అసైన్డ్?, పోడు పట్టాలు దక్కాయంటే పోరాటం కమ్యూనిస్టులది, పరిష్కారం కాంగ్రెస్?దని వివరించారు. వారి ఉద్యమాల ఫలితంగానే కాంగ్రెస్ అనేక చట్టాలు తెచ్చిందని గుర్తుచేశారు.

## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం..

- **ప్రయాణికులతో వెళుతున్న వాహనం బోల్తా**
- **12 మంది మృతి, పదుల సంఖ్యలో గాయాలు**

బాఘ్‌పత్,సెప్టెంబర్7: ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. బాఘ్‌పత్ జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ప్రయాణికులతో వెళుతున్న ఓ పికప్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో 12 మంది అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. రాజస్థాన్ నుంచి 32 మంది ప్రయాణికులతో బదౌన్‌కు బయలుదేరిన పికప్ వాహనం,. సోమవారం అర్ధరాత్రి దాదాపు 12:30 గంటల సమయంలో ఖేక్డా పోలీస్ స్టేషన్ పరిధిలోకి రాగానే ప్రమాదానికి గురైంది. వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో బోల్తా పడింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఖేక్డా, బాఘ్‌పత్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఉన్నత స్థాయి ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉన్నారని, ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో మేల్కొనేలోపే వాహనం బోల్తా పడిందని క్షతగాత్రులు తెలిపారు.

## నియోజకవర్గానికో కోటి!

తెలిపారు. కార్యకర్తలు బలంగా ఉంటే పార్టీ బలంగా ఉంటుందన్నారు. స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. 'మహిళలకు కేటాయించిన సీట్లలో పోటీ చేసేందుకు సమర్థులను గుర్తించాలి. కూటమి ప్రభుత్వం వచ్చాక చాలా సమస్యలు పరిష్కరించాం. ప్రజల్లో సానుకూలత ఉంది. అది స్థానిక ఎన్నికల్లో ప్రతిఫలించాలి. 2029 ఎన్నికల్లో 2024 కంటే మెరుగైన ఫలితాలు సాధించాలి. అందుకే ప్రతిరోజూ పార్టీకి కొంత సమయం కేటాయిస్తున్నాను' అని అన్నారు.

## కొత్త అర్హులకూ అవకాశం

**సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ**

**స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు**

అమరావతి, సెప్టెంబర్ 7 : రాష్ట్రంలో ప్రతి నెలా జరిగే 'పేదల పండుగ'ను ప్రభుత్వం మరో స్థాయికి తీసుకువెళ్తోంది. ఇప్పటికే దేశంలోనే అత్యధిక స్థాయిలో సామాజిక భద్రత పింఛన్లు అందిస్తూ 62 లక్షల మంది పేదలకు ప్రతి నెలా ఆర్థిక భరోసా కల్పిస్తున్న కూటమి ప్రభుత్వం, ఇప్పుడు ఆ భరోసాను మరింత విస్తరించేందుకు సిద్ధమైంది. అర్హత కలిగిన మరింత మంది పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర బలహీన వర్గాలకు కొత్తగా అవకాశం కల్పిస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద తాజా దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తుల పరిశీలన నుంచి అర్హత నిర్ధారణ, ప్రభుత్వ ఆమోదం వరకు ప్రతి ప్రక్రియను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేసి, అర్హులైన వారికి దశలవారీగా పింఛన్లు మంజూరు చేయనున్నారు. అర్హులైన వారు తమకు సంబంధించిన స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డు కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చు. దరఖాస్తు స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయిన తరువాత నిర్దిష్ట కాలపట్టిక ప్రకారం అర్హతను పరిశీలిస్తారు.

# నష్టాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

న్యూఢిల్లీ,సెప్టెంబర్7 దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, చమురు ధరల్లో అస్థిరత, వడ్డీ రేట్లు మరింత పెరగొచ్చన్న ఆందోళనలు ఇన్వెస్టర్లపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటీ, మెటల్, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు దిగజారాయి. సెన్సెక్స్ 382.62 పాయింట్లు నష్టపోయి 76,132.81 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 118.55 పాయింట్లు కోల్పోయి 23,779.15 వద్ద ముగిసింది. రెండు సూచీలు సుమారు 0.5 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీ సాంకేతికంగా కీలక స్థాయికి చేరిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. 23,800 స్థాయి గతంలో కీలక మద్దతుగా నిలిచింది. ఇప్పుడు అదే స్థాయి తక్షణ నిరోధంగా మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నిఫ్టీ ఈ స్థాయిని అధిగమించి నిలదొక్కుకోకపోతే అమ్మకాల ఒత్తిడి కొనసాగే అవకాశముందని చెబుతున్నారు. మరోవైపు 23,750-23,700 స్థాయిని తక్షణ మద్దతుగా నిపుణులు చూస్తున్నారు. ఈ స్థాయి కంటే దిగువన నిఫ్టీ ముగిస్తే మరింత అమ్మకాలు జరిగి 23,600 ప్రాంతం వరకు పడిపోయే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు. నిఫ్టీలో ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్లు ఎక్కువగా నష్టపోయాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.46 శాతం తగ్గగా, స్మాల్‌క్యాప్ 0.02 శాతం స్వల్పంగా పెరిగింది. రంగాల వారీగా ఐటీ, మెటల్ షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియల్టీ, మీడియా షేర్లు కూడా వెనుకబడ్డాయి. అయితే ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లు మాత్రం మార్కెట్ ప్రతికూలతను తట్టుకొని మెరుగ్గా రాణించాయి. అంతర్జాతీయ పరిణామాలు, చమురు ధరల కదలికలపై ఇన్వెస్టర్లు నిశితంగా దృష్టి పెట్టారు.

# మ్యాట్రిమోనీ పేరుతో భారీ మోసాలు

ప్రొఫైల్ పెట్టామంటారా.. అంటూ కేటుగాళ్లు ఫోన్ లో అడుగుతారు. తల్లిదండ్రులు ఆసక్తి చూపగానే వెంటనే వాట్సాప్‌లో ఓ అందమైన అబ్బాయి ఫొటో.. దాంతోపాటు ఆకట్టుకునే ప్రొఫైల్ పంపిస్తారు. ఎన్‌ఆర్‌ఐ.. డాక్టర్.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.. భారీ జీతం.. కోట్ల విలువైన ఆస్తులు అంటూ ప్రొఫైల్‌ను నమ్మేలా చేస్తారు. అబ్బాయి నచ్చాడని చెప్పగానే అసలు కథ మొదలవుతుంది. అబ్బాయి నచ్చాడని చెప్పగానే అసలు కథ మొదలవుతుంది. మీ పేరు రిజిస్టర్ చేయాలంటే రూ.5 వేలు పంపండి. అబ్బాయి తల్లిదండ్రుల ఫోన్ నంబర్ ఇస్తాం. మరికొన్ని మంచి ప్రొఫైల్స్ కూడా పంపిస్తాం అంటూ నమ్మిస్తారు. పెళ్లి సంబంధం కుదిరే ఆశతో తల్లిదండ్రులు డబ్బులు పంపిస్తారు. డబ్బులు అందిన కొద్దిసేపటికే అబ్బాయి తల్లిదండ్రుల పేరుతో ఓ ఫోన్ నంబర్ ఇస్తారు. కానీ ఆ నంబర్‌కు కాల్ చేస్తే.. "ఈ నంబర్ ప్రస్తుతం పనిచేయడం లేదు" అనే సమాధానం వస్తోంది. మ్యాట్రిమోనీకి ఫోన్ చేస్తే.. స్విచ్ఛాఫ్ వస్తుంది. వాట్సాప్‌లో పంపిన ప్రొఫైల్ లేదు.. ఫోన్ కాల్ చేసిన వ్యక్తి లేడు.. డబ్బులు మాత్రం తిరిగి రాక తల్లిదండ్రులు సైబర్ కేటుగాళ్ల చేతిలో మోసపోతున్నారు. వీటితోపాటు మరో తరహాలోనూ ఈ మోసాలు జరుగుతున్నాయి. ముందుగా పేరున్న మ్యాట్రిమోనీ సంస్థల్లో కొంత మొత్తాన్ని చెల్లించి.. అక్కడి ప్రొఫైల్స్‌ను పరిశీలిస్తారు. పక్కా వ్యూహంతో వారికి నచ్చిన ప్రొఫైల్స్ పట్టుకుని వేటకు బయలు దేరుతారు. ఎక్కువ కాలంగా సంబంధం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలు.. వయసు దాటిపోతున్న యువతీ యువకులు.. రెండో పెళ్లి కోసం చూస్తున్నవారు.. ఇలా ప్రత్యేకంగా టార్గెట్ చేసుకుంటారు. ఆ తర్వాత తామే మ్యాట్రిమోనీ నిర్వాహకులమని పరిచయం చేసుకుని.. మీకు మంచి సంబంధం కుదురుస్తాం అంటూ రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు అడ్వాన్స్ తీసుకుంటారు. డబ్బులు చేతికి వచ్చాక ఫోన్ ఎత్తరు. ఒకవేళ ఎత్తినా.. సంబంధం మాట్లాడుతున్నాం.. కొంత సమయం పడుతుంది అంటూ కాలయాపన చేస్తారు. చివరకు పూర్తిగా అందుబాటులో లేకుండా పోతారు. మ్యాట్రిమోనీ సంస్థల పేరుతో మోసగాళ్లు పక్కా వ్యూహంతో బాధితులను మోసం చేస్తున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.5 వేలు.. రూ.10 వేలు మాత్రమే తీసుకుంటారు. బాధితులు కూడా "ఇంత చిన్న మొత్తానికి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. కానీ ఇలాంటి వాళ్లు పదుల సంఖ్యలో.. వందల సంఖ్యలో కుటుంబాలను టార్గెట్ చేస్తే.. అదే పెద్ద మొత్తంగా మారుతుంది. ఈ తరహా మ్యాట్రిమోనీ కాల్స్ ఉమ్మడి నల్లగొండ, కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి వస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. చిన్న మొత్తాల్లోనే మోసం చేస్తుండటంతో చాలామంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. అందుకే బయటకు కనిపించే కేసుల కంటే.. వాస్తవంగా మోసపోయిన వారి సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉందనే అనుమానాలను పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి మోసాలపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారు.మ్యాట్రిమోనీ పేరుతో ఫోన్ వస్తే వెంటనే నమ్మొద్దని పోలీసులు, సైబర్ నిపుణులు సూచిస్తున్నారు. సంస్థ పూర్తి వివరాలు తెలుసుకోవాలనీ, కార్యాలయ చిరునామా, సంప్రదింపు వివరాలు పరిశీలించాలనీ సూచిస్తున్నారు గుర్తింపు లేని వ్యక్తిగత నంబర్లకు డబ్బులు పంపకూడదనీ, అబ్బాయి, కుటుంబ సభ్యుల వివరాలను స్వతంత్రంగా తెలుసుకోవాలని, ఫొటోలు, ఉద్యోగం, ఆస్తుల వివరాలను మాత్రమే నమ్మకూడదనీ సైబర్ నిపుణులు చెబుతున్నారు తొందరపెట్టి డబ్బులు అడిగితే అప్రమత్తం కావాలనీ, మోసం జరిగితే చెల్లింపు వివరాలు, ఫోన్ నంబర్లు, వాట్సాప్ చాట్స్, ప్రొఫైల్ ఫొటోలు భద్రపరచాలనీ సూచిస్తున్నారు.

## యెమెన్‌లో మళ్లీ భగ్గుమన్న హింస..

న్యూఢిల్లీ,సెప్టెంబర్7 యెమెన్‌లో మళ్లీ హింస ప్రజ్వరిల్లింది. ప్రభుత్వ బలగాలకు, హౌతీ తిరుగుబాటుదారులకు మధ్య పశ్చిమ ప్రావిన్సులైన తాయిజ్, హోదైదాలో గత నాలుగు రోజులుగా జరు గుతున్న భీకర ఘర్షణల్లో కనీసం 117 మంది మరణించారు. కొంతకాలంగా ప్రశాంతంగా ఉన్న యుద్ధ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కడంతో దేశంలో మళ్లీ పూర్తిస్థాయి యుద్ధం మొదలవుతుందనే ఆందోళనలు

వ్యక్తమవుతున్నాయి. వైద్య అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, గురువారం నుంచి మొదలైన ఈ పోరులో 54 మంది ప్రభుత్వ సైనికులు ప్రాణాలు కోల్పోగా, అనేకమంది గాయపడ్డారు. అదే సమయంలో, హోదైదా ప్రావిన్సులోని హౌతీ అధీనంలో ఉన్న ఆసుపత్రుల సమాచారం ప్రకారం, 63 మంది హౌతీ సభ్యులు మరణించారు. దీంతో ఇరుపక్షాల మృతుల సంఖ్య 117కు చేరినట్లు వైద్య వర్గాలు ధ్రువీకరించాయి. వ్యూహాత్మకమైన బాబ్ అల్-మందబ్ జలసంధి సమీపంలో హౌతీలు పెద్ద ఎత్తున దాడులకు దిగడంతో ఈ ఘర్షణలు మొదలయ్యాయి. గత 24 గంటల్లో హౌతీలు కొన్ని ప్రాంతాల్లో వేగంగా ముందుకు చొచ్చుకురావడంతో, ప్రభుత్వ దళాలు వారిపై ఎదురుదాడికి దిగాయి. శుక్రవారం యెమెన్ ప్రభుత్వ యుద్ధ విమానాలు హోదైదా, తాయిజ్ ప్రావిన్సుల్లోని హూతీల స్థావరాలపై వైమానిక దాడులు జరిపి భూతల దళాలకు మద్దతుగా నిలిచాయి. ప్రభుత్వ సైనిక అధికారి ఒకరు తెలిపిన వివరాల ప్రకారం, హౌతీలు స్వాధీనం చేసుకున్న కొన్ని కీలక స్థానాలను ప్రభుత్వ దళాలు మెరుపు వేగంతో జరిపిన ప్రతిదాడిలో తిరిగి చేజిక్కించుకున్నాయి. ఇటీవలి సంవత్సరాలలో పశ్చిమ యెమెన్‌లో ఇంతటి తీవ్రస్థాయిలో భూతల పోరాటం జరగడం ఇదే మొదటిసారని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# త్రివిధ దళాల సామర్థ్యం మరింత బలోపేతం

కొనుగోళ్లకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ పలు కీలక ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఆమోదం పొందిన ప్రతిపాదనల్లో 98 శాతం దేశీయ రక్షణ రంగ సంస్థల నుంచే కొనుగోళ్లు చేయనున్నట్లు స్పష్టం చేసింది.సాయుధ దళాల ఆధునీకరణే లక్ష్యంగా ఈ ఏడాదిని 'సంస్కరణల సంవత్సరం'గా ప్రకటించిన రక్షణశాఖ త్రివిధ దళాల బలోపేతానికి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎలాంటి పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా సైన్యానికి అవసరమైన ఆయుధ పరికరాల సేకరణకు పచ్చజెండా ఊపింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఏకంగా రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదముద్ర వేసింది. డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో భారత సైన్యానికి అవసరమైన కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ రెక్కీ వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాలు కలుషితమైన ప్రాంతాలను గుర్తించి, పర్యవేక్షించడంతో పాటు మార్కింగ్ చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అత్యంత క్లిష్టమైన సరిహద్దు భూభాగాల్లో దళాల వేగవంతమైన కదలికలు, లాజిస్టిక్స్, ఆపరేషనల్ సపోర్ట్ కోసం హై మొబిలిటీ వెహికల్స్ కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రువులకు ముకుతాడు వేసేలా సవాలుతో కూడిన ప్రాంతాల్లో అత్యంత వేగంగా, సమర్థవంతంగా మందుపాతరలను అమర్చేందుకు సెల్ఫ్-ప్రొపెల్డ్ మెకానికల్ మైన్ లేయర్స్ కొనుగోలుకు సైతం ఆమోదముద్ర వేసింది. యుద్ధ సమయాల్లో క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాల్లో అత్యంత సంక్లిష్టమైన మిషన్లలో కీలకంగా వ్యవహరించే అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు, ట్రాల్ ట్యాంకులు, సర్వత్ర బ్రిడ్జ్ సిస్టమ్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది.

భారత నావికాదళం కోసం 'ఆరుద్ర' రాడార్లతో పాటు మెరైన్ గ్యాస్ టర్బైన్ల రూపకల్పన, అభివృద్ధి, కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. వివిధ నావల్ ఎయిర్ స్టేషన్లలో ప్రస్తుతం ఉన్న ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లను ప్రవేశపెట్టనున్నారు. యుద్ధనౌకలకు ఇంధన సిస్టమ్‌గా పనిచేసే మెరైన్ గ్యాస్ టర్బైన్ల కొనుగోలుతో ఇంజిన్ల విషయంలో విదేశీ సంస్థలపైన ఆధారపడటం తగ్గుతుందని రక్షణ శాఖ స్పష్టం చేసింది.భారత వాయుసేనకు చెందిన ఫైటర్ జెట్లు, రవాణా విమానాలు, హెలికాప్టర్ల యుద్ధ సామర్థ్యాన్ని పెంచే పలు ప్రతిపాదనలకు సైతం డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రుదేశాల నిఘా రాడార్లను సమర్థంగా అడ్డుకునే గ్రౌండ్-బేస్డ్ మల్టీ-పర్పస్ జామర్ల కొనుగోలుకు పచ్చజెండా ఊపింది. రక్షణ వ్యవస్థల భద్రతను డిజిటలైజ్ చేస్తూ 'డిఫెన్స్ ఫోర్సెస్ సెక్యూర్ యాక్సెస్ కార్డ్' వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు డీఏసీ అంగీకారం తెలిపింది. దీని ద్వారా దళాల్లో ఇప్పటివరకు ఉన్న పాత పేపర్ గుర్తింపు కార్డులు, పాస్‌లు, పర్మిట్ల స్థానంలో పరస్పరం పనిచేసే అత్యాధునిక స్మార్ట్ కార్డులను అమలు చేయనున్నారు. ఈ కొనుగోలులో 98 శాతం దేశీయ పరిశ్రమల నుంచే సేకరించనున్నట్లు రక్షణ శాఖ స్పష్టం చేసింది. తద్వారా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి మరింత ఊతమిస్తుందని వెల్లడించింది.

# అసెంబ్లీ వద్ద రచ్చ..

తీసుకున్నారు. అసెంబ్లీలోకి నల్ల టీషర్టులతో వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా హరీశ్‌రావు బ్లాక్ టీషర్ట్ విప్పి బనియన్‌తో అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ సహా పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఇదే విధంగా టీషర్టులు విప్పి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద హరీశ్‌రావును అరెస్ట్ చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే నల్ల టీషర్ట్ ధరించి అసెంబ్లీకి రావడంపై పోలీసులు అభ్యంతరం చెప్పడాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. రాహుల్ గాంధీ టీషర్ట్ ధరించి పార్లమెంట్‌కు వెళ్తే తప్పు లేనప్పుడు.. తాము నల్ల టీషర్టులు వేసుకుని నిరసన తెలపడం ఎందుకు తప్పని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తమ నిరసనను అడ్డుకుంటోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

ఇక.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్.. పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పోలీసులు డ్యూటీ చేయండి, కానీ అతి చేయకండి అంటూ వ్యాఖ్యలు చేశారు. 2 ఏళ్లలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని.. వార్నింగ్ ఇచ్చారు. పోలీసులతో వాగ్వాదంలో తనకు అయిన గాయాలను.. మీడియాకు కేటీఆర్ చూపించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. మరోవైపు.. అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తమతో అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. తన చీర పట్టుకుని లాగేశారని.. బూటు కాళ్లతో తొక్కారని ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల కూడా పోలీసులు తీరును మార్చుకోవాలని ఆమె మండిపడ్డారు. మరోవైపు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అసెంబ్లీ మెయిన్ గేటు వద్ద అస్వస్థతకు గురై కిందపడిపోయారు. కొద్దిసేపు ఆయన స్పృహ కోల్పోయినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. దీంతో అక్కడ ఉన్న పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఆందోళన నెలకొంది. ఆయన తన కాలికి అయిన గాయాన్ని కూడా మీడియాకు చూపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో ఇచ్చిన హామీల అమలు తీరును ప్రశ్నించేందుకు నల్ల దుస్తులతో అసెంబ్లీకి వచ్చినట్లు బీఆర్ఎస్ సభ్యులు తెలిపారు. ఇటీవల రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైన 22ఏ భూముల అంశాన్ని కూడా సభలో ప్రధానంగా ప్రస్తావించేందుకు ఆ పార్టీ సిద్ధమైంది.

మరోవైపు అసెంబ్లీ వద్దకు వచ్చిన బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది అనుచితంగా ప్రవర్తించారని హరీష్ రావు ఆరోపించారు. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి దారుణంగా ప్రవర్తించారని అన్నారు. మంత్రిగా సేవలు అందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని సైతం జుట్టు పట్టి లాగడం మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలుపుతుందని ఎద్దేవా చేశారు. అక్కాచెల్లెమ్మలతో ఇంత దుర్మార్గంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చినట్లు హరీష్ రావు తెలిపారు. మేం సభలో లేని సమయంలో ప్రధాన ప్రతిపక్షం లేకుండా వివాదాస్పద 22 ఏ నిషేధిత భూముల అంశంపై చర్చ జరపడం సరికాదన్నారు. తాము చేసేది తప్పు కాదంటే, ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదని భావిస్తే బీఆర్ఎస్ సభ్యులు సభకు వచ్చినప్పుడు చర్చ జరగపాలని హరీష్ రావు ప్రభుత్వానికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తామన్న భయంతో మేం లేని సమయం చూసి సభలో చర్చిస్తున్నారు. ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే కనుక మేం సభకు వచ్చినప్పుడు కీలకమైన నిషేధిత భూముల అంశంపై చర్చ జరగాలని ప్రభుత్వానికి హరీష్ రావు సూచించారు. పోలీసుల తోపులాటలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతికి, నుదిటికి గాయాలైనట్లు తెలుస్తోంది. మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీశ్ రెడ్డి కిందపడిపోయారు. తమను పోలీసులు అడ్డుకోవడంతో అసెంబ్లీ గేటు వద్ద హరీష్ రావు తన చొక్కా విప్పేశారు. నల్ల టీషర్టుతో లోపలికి అనుమతించకపోవడంతో హరీష్ రావు బనియన్‌తో నిరసన తెలుపగా, ఆయనతో పాటు వేముల ప్రశాంత్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్ సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేసి తెలంగాణ భవన్‌కు తరలించారు. అసెంబ్లీలోకి వెళ్లకుండా పోలీసులు తమపై అమానుషంగా ప్రవర్తించారని పార్టీ నేతలు ఆరోపించారు. మరోవైపు, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు అత్యంత దుర్మార్గంగా ప్రవర్తించారని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు.

THARANGALU DAILY NEWS
మంగళవారం, 08 సెప్టెంబర్ , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# ఉపాధ్యాయులు సమాజంతో మమేకమైతేనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరుగుతుంది





- మండల విద్యాధికారి మంగు జయప్రకాశ్

జఫర్గడ్ ప్రతినిధి, సెప్టెంబర్ 7,(తరంగాలు): ఉపాధ్యాయులు సమాజంతో మమేకమై పనిచేసినప్పుడే తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెరిగి, విద్యార్థుల నమోదు గణనీయంగా పెరుగుతుందని జఫర్‌గఢ్ మండల విద్యాధికారి మంగు జయప్రకాశ్ అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జఫర్‌గఢ్‌లో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. మండల విద్యాధికారి మంగు జయప్రకాశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగానికి చెందిన 36 పాఠశాలల నుంచి ఒక్కొక్కరి చొప్పున మొత్తం 36 మంది ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా జయప్రకాశ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో తమ విధులను నిర్వహిస్తున్నారని అన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు తల్లిదండ్రులు, ప్రజలు, సమాజంతో సత్సంబంధాలను కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతతో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జఫర్‌గఢ్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు గోపిరెడ్డి పద్మ, కూనూరు జీహెచ్‌ఎం మహ్మద్ పర్వేజ్, ఉప్పుగల్ జీహెచ్‌ఎం ఫర్హత్ కౌసర్, తిమ్మంపేట జీహెచ్‌ఎం షారోన్ పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంకం సతీష్ కుమార్, సత్యనారాయణ, సదాశివుడు (తపస్), మెంతుల శ్రీనివాస్, వంగ నాగరాజు (టీఎస్‌యూటీఎఫ్), అంచూరి సురేష్, వేణుగోపాల్ (డీటీఎఫ్), బండి కుమారస్వామి (ఆర్యూపీపీ), దామెర ఉపేందర్ (డీటీయూ), పిట్టల మహేందర్ తదితరులు పాల్గొన్నారు. సీఆర్పీలు పుట్ట స్వామి, మంద బాబు, రమాదేవి, సునీత, ఎమ్మార్సీ సిబ్బంది బక్కం రాజ్ కుమార్, మామిడాల శివకృష్ణ తదితరులు హాజరయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 36 మందికి పురస్కారాలు అందజేసి అభినందనలు తెలిపారు.

## అక్రమ అరెస్టులతో బీజేపీ గొంతు నొక్కలేరు

- కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వానికి, అరెస్టులకు భయపడేది లేదు
- బీజేపీ మండల అధ్యక్షుడు అడప రాజు ముందస్తు అరెస్ట్
- విద్యార్థుల సమస్యలపై తమ పోరాటం ఆగదు
- బకాయిలు విడుదలయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తాం...అడప రాజు



**వర్ధన్నపేట ప్రతినిధి, సెప్టెంబర్ 7,తరంగాలు :** అక్రమ అరెస్టులతో బీజేపీ గొంతు నొక్కలేరని వర్ధన్నపేట బీజేపీ మండల అధ్యక్షుడు అడప రాజు అన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చేపట్టిన "చలో అసెంబ్లీ" నేపథ్యంలో వర్ధన్నపేట మండల బీజేపీ అధ్యక్షుడు అడప రాజును పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. చలో అసెంబ్లీ కార్యక్రమానికి బీజేపీ శ్రేణులు తరలివెళ్లకుండా పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా అడప రాజు తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అడుప రాజు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును కూడా ప్రభుత్వం అడ్డుకోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు . నాయకులను ముందస్తుగా అరెస్టు చేసినా విద్యార్థుల సమస్యలపై తమ పోరాటం ఆగదని, బకాయిలు విడుదలయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు . ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కొండేటి సత్యం, రాయపురపు కుమారస్వామి, మల్లెపాక అనిల్, గిరి బాబు , తేజ నాయక్, దేవేందర్, సుంకరి బాబు, ఎల్ల స్వామి, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేసిన బిఆర్ఎస్ మండల నాయకులు



**జఫర్గడ్ ?ప్రతినిధి, సెప్టెంబర్ 7,(తరంగాలు ):** మాజీ తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య ఆదేశాల మేరకు, జఫర్‌గఢ్ మండల బి ఆర్ యస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు మండల ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ఒక విజ్ఞపన పత్రాన్ని సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలు, 13 డిక్లరేషన్లు 420 హామీలను తక్షణమే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.?విజ్ఞపన పత్రంలో పేర్కొన్న ముఖ్యాంశాలు:?మహాలక్ష్మి పథకం: మహిళలకు నెలకు ?2,500 ఆర్థిక సాయం, తులం బంగారం మరియు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించాలి.?రైతులు ˜ కూలీలు: రైతు భరోసా, కొరత లేకుండా ఎరువుల పంపిణీ, పంటలకు బోనస్, 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్ అందించాలి. అలాగే వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి 12,000 సాయం అందించాలి.?ఇండ్లు లేనివారికి: ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి.?యువత ˜ విద్యార్థులు: నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్ అమలు, విద్యా భరోసా మరియు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలి.?పింఛన్లు: వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మరియు బీడీ కార్మికులకు పెంచిన ?4,000 పింఛన్ అందించాలి.?ఆటో డ్రైవర్లు: ఆటో అన్నలకు ఏడాదికి ?12,000 ఆర్థిక సాయం అందజేయాలి.?ఇతర డిమాండ్లు: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ డిక్లరేషన్లలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. గ్రామాల్లో నిలిచిపోయిన పారిశుధ్య నిర్వహణను పునరుద్ధరించాలని మరియు హామీలపై ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు పెట్టడం ఆపాలని కోరారు.?పాల్గొన్న ముఖ్య నాయకులు:?పెంతల రాజ్ కుమార్ తాజా మాజీ మార్కెట్ డైరెక్టర్ / కన్వీనర్?మారేపల్లి కరుణాకర్ మండల తాజా మాజీ యూత్ అధ్యక్షుడు?శాపల్లి యాకయ్య మాజీ సర్పంచ్?మండల నాయకులు: గుడ్డేటి స్వామి, ఎండీ ఖాసీం, చందర్, నాగేష్, ఎండీ భాషిర్, బక్కం రాజు, గాద శ్రీనివాస్, నాగరాజు, ?సోషల్ మీడియా ఇంచార్జ్: కాటా కృష్ణ, గబ్బేటా కొమురయ్య, జనార్ధన్, సారయ్య, మరియు ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రంగు శివకుమార్ గౌడ్ కి నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య

**జఫర్‌గఢ్ ప్రతినిధి, సెప్టెంబర్ 7,(తరంగాలు):** మండలంలోని తమ్మడపల్లి జి గ్రామానికి చెందిన రంగు శివకుమార్ గౌడ్ మరణించిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య వారి స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. రంగు శివకుమార్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమం లో సోమిరెడ్డి, పెంతలా రాజకుమార్,మారపెల్లి కరుణాకర్, బి ఆర్ యస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల గొంతు నొక్కేందుకు అక్రమ హౌస్ అరెస్టులా

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై పోరాటాన్ని అడ్డుకున్న పోలీసులు..
- బకాయిలు చెల్లించరు.. ప్రశ్నిస్తే అరెస్టులా?
- కాంగ్రెస్ ప్రభుత్వం పై ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఆగ్రహం



**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 7,తరంగాలు :** విద్యార్థుల గొంతు నొక్కేందుకు అక్రమ హౌస్ అరెస్టులా..?అని బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన "చలో అసెంబ్లీ" కార్యక్రమానికి బయలుదేరకుండా బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యార్థుల సమస్యలపై నిరసన తెలిపేందుకు వెళ్తున్న నాయకులను ముందస్తు అరెస్టులు, హౌస్ అరెస్టులతో అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని ఎర్రబెల్లి ప్రదీప్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కేందుకు పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకోవడం అణచివేత ధోరణికి నిదర్శనమని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో విద్యార్థులు, కళాశాలలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడకుండా తక్షణమే బకాయిలను విడుదల చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. అరెస్టులతో ఉద్యమాలను అణచలేరని, హౌస్ అరెస్టులతో బీజేపీ పోరాటాన్ని ఆపలేరని ఎర్రబెల్లి ప్రదీప్ రావు స్పష్టం చేశారు. విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం ప్రభుత్వంపై ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## మున్సిపల్ కార్మికుల పెండింగ్ ఎరియర్స్ చెల్లించాలి సిఐటియూ




**ఇల్లందు ప్రతినిధి, సెప్టెంబర్ 7,( తరంగాలు ):** ఇల్లందు మున్సిపల్ కార్మికుల పెండింగ్ ఏరియల్ చెల్లించాలని. పెండింగ్ ప్రావిడెంట్ ఫండ్ ను వెంటనే జమచేయాలని మున్సిపల్ శానిటేషన్, వాటర్ వర్క్స్ కార్మికులు సమ్మె కు నేటి తెల్లవారు ఝామున ఉపక్రమించారు. కార్మికులు స్వచ్ఛందంగా సమ్మె కు దిగిన నేపథ్యం లో మున్సిపల్ కమీషనర్ హుటవిటిన మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని కార్మికులకు రావలసిన ఏరియర్స్ లో సగం రేపు చెల్లిస్తామని, పీఎఫ్ సమస్య పై నేటి కలెక్టర్ ప్రజావాణికి 15మంది కార్మికులు రావాలని కోరిన మీదట కార్మికులు సమ్మె ను విరమించారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ నాయకులు అబ్దుల్ నబీ, తాళ్లూరి కృష్ణ, టియూసిఐ నాయకులు పాయం వెంకన్న, కార్మికులు పాల్గొన్నారు.

## సలహా మండలిలో సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడం దుర్మార్గమైన చర్య - సీఐటీయూ



**ఇల్లందు ప్రతినిధి,సెప్టెంబర్ 7,( తరంగాలు ):** సిఐటియు ఆధ్వర్యంలో ఇల్లందు పట్టణ స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద, అలాగే మున్సిపల్ పని కేంద్రం వద్ద నిరసనకార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ నబీ మాట్లాడుతూ, కేంద్ర బిజెపి ప్రభుత్వం కేంద్ర కనీస వేతనాల సలహా మండలిని ఏర్పాటు చేయడం జరిగిందని. ఈ సలహా మండలిలో సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎన్టియుసి సంఘాలకు ప్రతినిద్యం కల్పిం చలేదన్నారు. ప్రభుత్వానికి, యాజమాన్యాలకు అనుకూ లంగా ఉండే సంఘాలకు మాత్రమే కేంద్ర కనీస వేతనాల సలహా మండలిలో ప్రతినిద్యం కల్పించారని అన్నారు. కార్మిక హక్కుల కోసం నిజాయితీగా కార్మికుల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న సిఐటియుకి ప్రతినిత్యం ఇవ్వకపోవడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. సిఐటియు తో పాటు ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ లకు కూడా ప్రతినిద్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బద్రు, కామకోటేశ్వరరావు, సిహెచ్ వెంకటేశ్వర్లు, రామ్మూర్తి, జీవన్, లాల్ పాసి, ఎండి బషీర్,ఎస్ విజయ్ కుమార్,సాయిలు, సైదులు, వేణు,కొర్లపాటి దాసు, కడారి వెంకట్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులను గుర్తించాలని

- ప్రజావాణిలో దరఖాస్తు అందజేత
- సంగిశెట్టి క్రిస్టఫర్ జోగు అంజయ్య మలిదశ ఉద్యమకారులు

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి సెప్టెంబర్ 7 తరంగాలు**

స్వరాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులను గుర్తించాలని వలిగొండలో ప్రజావాణిలో దరఖాస్తు అందజేసిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజయ్య లు సోమవారం ప్రజావాణిలో దరఖాస్తు అంద చేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారుల సంక్షేమం గుర్తింపు పట్ల క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు ఉద్యమకారులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రభుత్వం దగ్గర స్పష్టమైన సమాచారం ఉందని కానీ ప్రత్యేక వెబ్సైటు ప్రారంభించాలని కాలయాపన చేయవద్దని వారు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికీ అనేక మంది ఉద్యమకారులు చనిపోయారని మరికొంతమందిని ఆదుకోవడానికి వేగంగా అడుగులు వేయాలని వారు అన్నారు.



జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
మంగళవారం, 08 సెప్టెంబర్ , 2026


# గురువులు జీవితాన్నిస్తారు




**వర్ధన్నపేట ఎంపీడీవో వెంకటరమణ**

**వర్ధన్నపేట ప్రతినిధి , సెప్టెంబర్ 7, తరంగాలు** : తల్లిదండ్రులు జన్మనిస్తే.. గురువులు జీవితాన్నిస్తారని గురువులను గౌరవించాలని వర్ధన్నపేట ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశం లో సోమవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు వారు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఈఓ మాము నూరి శ్రీధర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ సమాజంలో గురువులపాత్ర ఉన్నతమైనదన్నారు. గురువులపై ప్రతి విద్యార్థి అంకితభావంతో ఉండాలన్నారు. చదువు చెప్పే వారు మాత్రమే గురువులు కాదని, సన్మార్గంలో నడిపించే ప్రతిఒక్కరూ గురువులేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదన్నారు. విద్యార్థులు సమాజంలో ఉన్నతస్థాయిలో రాణించడానికి తల్లిదండ్రుల కృషి ఎంత ఉంటుందో గురువుల కృషి కూడా అంతే ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులకు శాలువామేమంటూ ధ్రువీకరణ పత్రాలతో గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కాయత శ్రీనివాస్, కృష్ణ, సిహెచ్ రమేష్, సంఘాల నాయకులు మనుచేందర్ రెడ్డి, అశోక్, బంద రమేష్, కుసుమ కుమారస్వామి, సురేష్ గుడికందుల, ఉపాధ్యాయులు, సిఆర్పిలు తదితరులు, పాల్గొన్నారు

## సుమ్మెద ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలో అవినీతి

- **యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి సెప్టెంబర్ 7 తరంగాలు**



వలిగొండ మండల కేంద్రంలోని సుమేధ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద సిలిండర్ తీసుకొని బరువు తక్కువగా ఉన్నది అనే సందేహంతో వినియోగదారుడు అయిన బి.జె.పి జిల్లా సీనియర్ నాయకుడు బంధారపు రాములు గ్యాస్ ఆఫీస్ దగ్గరికి వెళ్లి ఏజెన్సీ సిబ్బంది ముందే తనిఖీ చెయ్యగా 2.50 కిలోల బరువు తక్కువ రావడం జరిగింది.సిలిండర్ లో ఎటువంటి సమస్య లేదు అని మాకు ఎం తెలియదు ఇండియన్ గ్యాస్ కంపెనీ నుండి అలానే వస్తుంది అని మేనేజర్ తెలియజేసారు. సాధారణంగా సిలిండర్ డెలివరీ సమయంలో బరువు పరిశీలించిన తర్వాతే వినియోగదారులకు అందించాల్సి ఉన్నప్పటికీ, చాలా సందర్భాల్లో తూకం వేయకుండానే సిలిండర్‌ను ఇంటి వద్ద దింపి వెళ్తున్నారు చెప్పగా మేనేజర్ వంశీ నిర్లక్ష్య ధోరణికి వ్యక్తం చేశారు.2 గంటల నిరీక్షణ తరువాత తనిఖీ చెయ్యడానికి అని రాకేష్ అనే వ్యక్తి వచ్చి తనిఖీ చేసి వచ్చుర్ బాగోలేదు అని చెప్పాడు.మెకానిక్ మండలంలో సిలిండర్లు డెలివరీ చేసే వ్యక్తి ఒక్కరే కావడం గమనార్హం.నిజానికి మండలంలోని దళారులు ఏజెన్సీ కూటమిగా అయి అవినీతికి పాల్పడుతున్నారు.ఆఫీస్ 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు ఎటువంటి డెలివరీ చార్జీలు తీసుకోకూడదు అయిన కానీ ప్రజల వద్ద దౌర్జన్యంగా తీసుకుంటున్నారు.ప్రజలకు నిత్యవసరం అయిన గ్యాస్ ఏజెన్సీలో ఎంతో కాలంగా జరుగుతున్న అవినీతిపై అధికారుల నిర్లక్ష్య ధోరణి గురించి ప్రజల్లో ఎన్నో అనుమానాలు ఏర్పడుతున్నాయని అని అన్నారు.

## ఫీజు బకాయిలు చెల్లించాలని బిజెపి లడాయి.

- **ఇందిరా పార్క్ ధర్నాకు వెళ్లకుండా వలిగొండ మండల బిజెపి నాయకుల ముందస్తు అరెస్ట్.**



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి సెప్టెంబర్ 07 తరంగాలు**

వలిగొండ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ తలపెట్టిన ఫీజు బకాయి, బిజెపి లడాయి ఇందిరా పార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాకు వలిగొండ మండలం నుండి ఎవరు వెళ్లకుండా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల నాయకులను కార్యకర్తలను ముందస్తు అరెస్టు చేయడం జరిగింది. వారిని బిజెపి నిర్వహించే ధర్నాకు వెళ్లకుండా అడ్డుకోవడం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసే కుట్రపూరిత రాజకీయాలకు నిదర్శనం అని చెప్పవచ్చు. కానీ అరెస్టుల ద్వారా బిజెపి నిర్వహించే ప్రజా పోరాటాలను అడ్డుకోలేదని బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ పత్రికా ముఖంగా తెలియజేయడం జరిగింది.రానున్న రోజుల్లో భారతీయ జనతా పార్టీ అధికారం చేపడుతుందని,ప్రజలకు సుపరిపాలన అందిస్తుందని వారు తెలియజేశారు.అరెస్ట్ అయిన వారిలో బిజెపి జిల్లా నాయకులు బంధారపు లింగస్వామి, కనతాల అశోక్ రెడ్డి, రాచకొండ కృష్ణ, మైసొల్ల రామ నర్సు,మండల నాయకులు మందుల నాగరాజు,బుంగమట్ల చిన్న మహేష్,పోలు నాగయ్య,సంక బుడ్డి హరికృష్ణ తదితర కార్యకర్తలు ఉన్నారు.

# 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ" ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా దామళ్ళ సత్యం



**ఖమ్మం, టౌన్ తరంగాలు న్యూస్ సెప్టెంబర్ 7**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్పి) ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా దామళ్ళ సత్యనారాయణ నియమితులయ్యారు. గత 20 ఏళ్లుగా క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయనకు వివిధ రాజకీయ, సామాజిక ఉద్యమాల్లో పనిచేసిన అనుభవం ఉంది. గతంలో బీఎస్పీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా, తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థి, సామాజిక, రాజకీయ రంగాల్లో చురుకైన పాత్ర పోషించిన ఆయనను తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. జిల్లాలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై మరింత చురుగ్గా పనిచేస్తానని సత్యనారాయణ తెలిపారు.

**-మల్లన్నకు కృతజ్ఞతలు..**

తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్నకు దామళ్ళ సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నిర్మాణానికి కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.




తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో గ్రామదేవతలకు బోనాలు

- **యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి సెప్టెంబర్ 7 తరంగాలు**



వలిగొండ మండల మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గ్రామ దేవతలకు మహిళలు భక్తి శ్రద్ధలతో గ్రామదేవతలకు బోనాలు తయారు చేసుకుని రైతుల డప్పు చప్పులతో శివసతుల శిగాలతో ముత్యాలమ్మ తల్లి వద్దకు వెళ్లి మొక్కులు చెల్లించి, బోనాల పండుగ జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,నాయకులు, మహిళలు,యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# యువత తలుచుకుంటే ఏదైనా సాధించగలరు

- ఏఐవైఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్
- ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలి




**యాదాద్రి భువనగిరి జిల్లా, సెప్టెంబర్ 7 (తరంగాలు):** యువత తలుచుకుంటే ఏదైనా సాధించగలరని ఏఐవైఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్ అన్నారు. వలిగొండ మండల కేంద్రంలోని దుప్పల్లి గ్రామంలో ఏఐవైఎఫ్ ప్రచారజాతను మాజీ నాయకులు కామ్రేడ్ బాలగోని సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ.. బీహార్‌లో విద్యార్థులు, నిరుద్యోగుల నిరసన సందర్భంగా ఓ ఆరేళ్ల బాలుడు విద్య, ఉద్యోగాలు, భవిష్యత్తుపై ప్రశ్నించిన ఘటనను ప్రస్తావించారు. చిన్నారి ప్రశ్నను కూడా ప్రభుత్వం సహించలేని పరిస్థితి ప్రజాస్వామ్యానికి ఆందోళనకర సంకేతమన్నారు. ప్రశ్నించడం, నిరసన వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య హక్కులని పేర్కొన్నారు.దేశంలో లక్షలాది మంది యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుండగా, ప్రభుత్వ శాఖల్లో భారీగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, అయితే ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు సహజ వనరులు ప్రజలకు దక్కేలా భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ యాక్ట్ రూపొందించి అమలు చేయాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేస్తోందన్నారు.అలాగే సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులకు పిలుపునిచ్చారు.ఏఐవైఎఫ్ మాజీ నాయకులు ఎలగందుల అంజయ్య మాట్లాడుతూ దేశంలో సహజ వనరులు, మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయని, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా యువతను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్ది సమాజాభివృద్ధిలో భాగస్వాములను చేయాలని అన్నారు.కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ నాయకులు కట్ల యాదగిరి, నరిగె యాదయ్య, అంబటి అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మొగుళ్ల శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు మారోజు నరసింహాచారి, సుద్దాల సాయికుమార్, మండల సమితి సభ్యులు కన్నబోయిన పృథ్వీరాజ్, మెట్టు లక్ష్మీనారాయణ, మునుగోటి చంద్రం, ఏఐఎస్ఎఫ్ మండల కన్వీనర్ బాలగోని మత్స్యగిరి, కావేటి సుధాకర్, నోముల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



**జఫర్గఢ్ ప్రతినిధి సెప్టెంబర్ 7, (తరంగాలు):** మండలంలోని సాగరం గ్రామానికి చెందిన పిన్నింటి సందీప్ 27 సంవత్సరాలు అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం 3నెలల క్రితం రెడ్డి మాసి హేమలత భావ్యశ్రీ ని 19సంవత్సరాలు పాండురంగాపురం పాల్వంచ మండలం భద్రాద్రి కొత్తగూడెం చెందిన అమ్మాయి ని ప్రేమించి వివాహం చేసుకున్నాడు.నాకుమారునికి మొదటి నుండి మద్యపానం సేవించడం అలవాటు ఉంది. 29-08-2026రోజున మద్యపానం అధికంగా సేవించడం వలన 30-8-2026రోజున ఉదయం సుమారు 10గంటల సమయంలో నీవు ప్రేమించి పెళ్లి చేసుకున్నావ్ మళ్ళీ మద్యం తాగడం మానేయాలిని గట్టిగా మందలించడం జరిగింది.అలాగే నా కోమారుడు మొదటి నుంచి ఆవేశపరుడు మమ్మల్ని బెదిరించాలానే ఉద్దేశం తో క్షనీకావేశంలో మా ఇట్టి పక్కన పశు వుల కొట్టంలో పత్తి చేనుకొరకు తీసుకవచ్చిన పురుగుల మందు త్రాగినాడు అది గమనించిన మేము వెంటనే 108అబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం హన్మకొండ లోని చక్రవర్తి హాస్పిటల్ లో చేర్పించము. 6-9-2026వరకు ఆరోగ్యం బాగా క్షినిచడం వలన మెరుగైన వైద్యం కొరకు ఎం జి యం తీసుకరాగా ఎం జి ఎం డాక్టర్ లు పరీక్షించి అప్పటి కే చనిపోయాడు అని మాకు రాత్రి 8గంటలకు మాకు తెలియపరిచారు.నా కుమారుడు క్షనీకావేశంలో పురుగుల మందు తాగడం వలనే ఆరోగ్యం విషమించి చనిపోయాడు. ఈ మరణం గురించి ఎవరిపైన ఎలాంటి అనుమానం లేదు కావున నా కుమారుని శవము పంచనామా నిర్వహించి దహన క్రియల నిమిత్తం అప్పగించాలని కుటుంబసభ్యులు కోరినారు. వారి తండ్రి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు యస్ ఐ తెలిపారు.

## స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు దుర్మార్గం

- ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అనిల్ కుమార్ ఆగ్రహం



**జఫర్‌గడ్ ప్రతినిధి, సెప్టెంబర్ 7 (తరంగాలు):** శాసనసభ స్పీకర్ స్థానంలో ఉన్న దళిత నేతను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అవమానించేలా వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కలకోట అనిల్ కుమార్ అన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను ఏకవచనంతో సంబోధిస్తూ అనుచిత, అసభ్య పదజాలం ఉపయోగించడం బాధ్యతారాహిత్యమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.స్పీకర్ పదవికి కనీస గౌరవం ఇవ్వకుండా చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ నేతల అహంకార ధోరణికి నిదర్శనమని విమర్శించారు. దళిత నేతను అవమానించే విధంగా మాట్లాడటం తీవ్రంగా బాధించిందని, ఇలాంటి వ్యాఖ్యలను ప్రజాస్వామ్యవాదులు సహించరాదని కలకోట అనిల్ కుమార్ పేర్కొన్నారు. తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధుసూదన్ సభ్యత్వం రద్దు చేయాలి

- డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై శాసనమండలి సభ్యులు తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్‌పై ఈ తరహా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను,రాజ్యాంగ విలువలను అవమానించడమేనని అన్నారు. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా ఉన్న స్పీకర్ పదవిని ప్రతి ప్రజాప్రతినిధి గౌరవించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన శిక్షణ ఇదేనా? అని నూతి సత్యనారాయణ గౌడ్ ప్రశ్నించారు.బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న తాతా మధుసూదన్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సమాజం హర్షించదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అనుచిత భాషకు బ్రాండ్ అంబాసిడర్‌గా తాతా మధుసూదన్ వ్యవహరిస్తున్నారని విమర్శిస్తూ, శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.తాతా మధుసూదన్ వ్యాఖ్యలు దళిత సమాజాన్ని కూడా తీవ్రంగా బాధించాయని నూతి సత్యనారాయణ గౌడ్ అన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని హామీ ఇచ్చి మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీ దళిత వ్యతిరేక వైఖరిని అవలంబించిందని ఆరోపించారు. ఇలాంటి వ్యాఖ్యలను ఉపేక్షిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధ పదవుల గౌరవం దెబ్బతింటుందని, తాతా మధుసూదన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్సీ తాతా మధుపై నిమ్మని శేఖర్ రావు ఫిర్యాదు





- స్పీకర్ గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు సరికాదు
- చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హన్మకొండ సుబేదారి పోలీసులకు పిర్యాదు

**హన్మకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 7,తరంగాలు :**ప్రజాప్రతినిధులపై వ్యక్తిగత, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు అన్నారు. సోమవారం తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు.వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు సోమవారం హన్మకొండ సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉండటంతో పాటు ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలిగించేలా ఉన్నాయని నిమ్మని శేఖర్ రావు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఫిర్యాదును పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గడ్డం విష్ణు ప్రసాద్, పోలేపాక బుచ్చిరెడ్డి, రఫీ, పాషా, నాయిని లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పువ్వాడ  ఉదయ నగర్ సర్పంచ్ కార్యదర్శి లపై కలెక్టర్ కు ఫిర్యాదు

- ఇల్లు కూల్చిన ఘటనలో నిందితులపై చర్యలు తీసుకునేలా ఆదేశించాలని బాధిత మహిళల వినతి



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** ఒంటరి మహిళ అయినా తనకు 2017వ సంవత్సరంలో ప్రభుత్వం తనకు 75 చదరపు గజముల స్థలాన్ని , పట్టా తో పాటు ఇంటి నెంబరు 1 - 85 ను మంజూరు చేయగా ఆనాటి నుండి తాను సదర్ ఇంటిలో ఇంటి పన్ను చెల్లిస్తూ కరెంటు మీటరు పంపు కనెక్షన్లు కూడా మాంజం చేసుకొని ఈ మధ్యకాలంలో ఇందిరమ్మ ఇల్లును కూండా అనుమతులు తెచ్చుకొని ఇన్నాళ్లుగా రేకుల ఇంటిలో నివసించిన తనను కబ్జాదారు గా చిత్రీకరిస్తూ సోషల్ మీడియాలో తనపై కొందరు ఉద్దేశపూర్వకంగా అనుచిత వాక్యాలు చేస్తున్నారని, ముఖ్యంగా పువ్వాడ ఉదయ్ నగర్ సర్పంచ్ సిద్దిక్, గ్రామ కార్యదర్శి మహేష్ లు తనపై కక్ష కట్టినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ భూక్య ఉపేంద్రబాయి అనే మహిళ సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా ఖమ్మం జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసింది. తనకు ఏమాత్రం సంబంధంలేని 193 నెంబరు గల ప్లాటును తను ఆక్రమించి నట్లు సర్పంచ్ కార్యదర్శిలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్ స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎండిఓ కార్యాలయంలో సైతం ఫిర్యాదు చేసినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇంతే కాకుండా తన వ్యక్తిత్వాన్ని తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగిస్తూ తన భర్తగా బద్రు అనే వ్యక్తిని పేరు జోడించడం వల్ల తనకు మానసికంగా బాధ కలిగించిందని,ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంతో పాటు ఎలాంటి విచారణ లేకుండా తనను కబ్జాదారు గా పేర్కొనడం పై సర్పంచ్ కార్యదర్శులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో భూక్య ఉపేంద్ర బాయి విజ్ఞప్తి చేసింది. గత ఆగస్టు మాసంలో 27వ తేదీ రాత్రి 11 సమయంలో పథకం ప్రకారం అన్యాయంగా, అక్రమంగా,తాను లేని సమయంలో తన ఇంటిని గ్రామ సర్పంచ్ సిద్దిక్ ప్రోత్సాహ, ప్రోత్బలంతో కొందరు వ్యక్తులు తన ఇంటిని ధ్వంసం చేశారని ఫలితాలు రెండు లక్షల రూపాయల మేరకు తనకు నష్టం వాటిల్లిందని బాధిత మహిళ భూక్య నాగేంద్ర జిల్లా కలెక్టర్ కు సమర్పించిన వినతి పత్రంలో ఆరోపించారు. ఈ 193 నెంబర్ గల ప్లాటును 2019వ సంవత్సరంలోనే ఆర్సి ఫైల్ నెంబర్ విఆర్ఏఓ /152 / 2019 ఇచ్చి తనకు స్వాధీన పరిచినట్లు ఆనాటి నుండి తాను అక్కడ రేకులతో ఇల్లు నిర్మించుకొని ఆ ఇంటి పై ఇంటి నెంబరు ఓటర్ ఐడి కార్డు కరెంట్ మీటర్లను కూడా సమపాధించుకున్నట్టు తెలిపారు. ఇలా ప్లాట్లకు సంబంధించిన అనేక సర్వేల సందర్భంగా కూడా తాను ఇక్కడే నివసించినట్లు తెలిపారు. తన ఈ ప్లాటుకు ఉపేంద్ర బాయి అనే మహిళకు ఎటువంటి సంబంధం లేకుండా సోషల్ మీడియా ద్వారా వేధిస్తూ ఉన్నటువంటి చర్యలు తీసుకోవాలని వారి కారణంగానే తనను టార్గెట్ చేశారని, ఈ విషయం లో రఘునాథపాలెం సిఐ యాకూబ్ ఇస్మాయిల్ ఫిర్యాదు చేయాలని వారు ఆ సమయంలో అక్కడ లేరని చెప్పటం, పది రోజులు దాటిన దీనిపై ఎఫ్ఐఆర్ చేయకపోవడం గురించి ప్రస్తావిస్తూ వీరందరి పాత్ర పై , ఇల్లు కూల్చిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, తనకు న్యాయం చేయాలని,నిందితులందరిపై ఎస్సీ ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని నష్టపరిహారం చెల్లించే విధంగా చూడాలని, అదేవిధంగా వీరి నుండి తనకు రక్షణ కల్పించాలని ఆమె జిల్లా కలెక్టర్ కు సమర్పించిన వినతి పత్రంలో మనవి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు గుంతెటి వీరభద్రం, దాసరి శ్రీను, లింగాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై కూన శ్రీశైలం గౌడ్ ఫోకస్

### అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 7,తరంగాలు :** కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సోమవారం షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను కలిసి వారి సమస్యలు, వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా పలు కాలనీల ప్రజలు మంచినీటి సరఫరా, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మాజీ ఎమ్మెల్యే కొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. మరికొన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అదేవిధంగా గాజులరామారం డివిజన్‌లోని పి.ఎం.రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్



నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు పాండు, కార్యవర్గ సభ్యులు కూన శ్రీశైలం గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపిన ఆయన, కాలనీ అభివృద్ధికి నూతన కమిటీ సమష్టిగా కృషి చేయాలని సూచించారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసుల దురుసు వైఖరి నశించాలి





- ఖమ్మంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన,రాస్తా రోకో

***తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :*** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులను అసెంబ్లీలోకి రానివ్వకుండా పోలీసులు అడ్డుకోవడం, వారిపై దురుసుగా వ్యవహరించడం, మహిళా శాసనసభ్యుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం, పలువురు ఎమ్మెల్యేలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఖమ్మం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం,రాస్తారోకో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఖమర్,మాజీ కార్పొరేటర్ కర్ణాటి కృష్ణ, మాజీ సుడా చెర్మన్ బచ్చు విజయ్ ,బీరెడ్డి,నాగచంద్రారెడ్డి తదితరులు పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 420 హామీలు, ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యాన్ని ఎండగడుతూ గత వారం రోజులుగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అంశాలన్నింటినీ అసెంబ్లీ వేదికగా ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తారనే భయంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి అడుగుపెట్టకుండా అడ్డుకున్నారని విమర్శించారు.ప్రతిపక్ష శాసనసభ్యులు ప్రజల తరపున ప్రశ్నలు అడిగితే సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కానీ ప్రశ్నలకు సమాధానం చెప్పలేని పరిస్థితిలో ప్రభుత్వం ప్రతిపక్ష గొంతును అణచివేసే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు.

ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలు, దూషణలకు దిగడం ముఖ్యమంత్రి స్థాయికి తగదని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు మాట్లాడే హక్కు, ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించే హక్కు ఉంటుందని, ఆ హక్కులను కాలరాయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ శాసనసభ్యులపై పోలీసులు వ్యవహరించిన తీరును, ముఖ్యంగా మహిళా శాసనసభ్యుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన తీరును తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్టులను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రజా సమస్యలపై ప్రతిపక్షం ప్రశ్నించే హక్కును ప్రభుత్వం గౌరవించాలని డిమాండ్ చేశారు.ప్రజల కోసం ప్రశ్నించే గొంతులను అణచివేస్తే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు.బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి ప్రసాద్ మాజీ కార్పొరేటర్లు షేక్ మక్బుల్,నాగండ్ల కోటి,కూరాకుల వల్లరాజు,పల్లా రోస్ లీనా,జ్యోతి రెడ్డి,కనకం భద్రయ్య, దేవ భక్తిని కిషోర్, పగడాల నరేందర్, బోజెడ్ల రాంమోహన్,షేక్ షకీన, మాటేటి కిరణ్, మారంపుల వీరభద్రం, మహ్మద్ రఫీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 10న 'చలో హైదరాబాద్--మహా ధర్నా'

- ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు,పెన్షనర్లు భారీగా తరలిరావాలి
- తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు



**వర్ధన్నపేట ప్రతినిధి, సెప్టెంబర్ 7,తరంగాలు :** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్--మహా ధర్నా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీజీఈజేఏసీ వరంగల్ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది.

ఈ కార్యక్రమం విజయవంతానికి సంబంధించి సోమవారం వర్ధన్నపేట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సన్నాహక సమావేశం నిర్వహించి, మహా ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ గాజే వేణుగోపాల్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహా ధర్నాకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ప్రధాన డిమాండ్లు

2వ వేతన సవరణ సంఘం నివేదికను వెంటనే అమలు చేసి, 01.07.2023 నుంచి 51 శాతం ఫిట్‌మెంట్ మంజూరు చేయాలి.ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే విడుదల చేయాలి.సుమారు రూ.10,000 కోట్ల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలి.ప్రతి నెలా కనీసం రూ.2,000 కోట్ల చొప్పున పెండింగ్ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.సీపీఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం ను పునరుద్ధరించాలి.ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఎన్ ఈ హెచ్ ఎస్ ను పూర్తిస్థాయిలో అమలు చేయాలి.ఉద్యోగ సంఘాల గుర్తింపును పునరుద్ధరించి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘాలతో చర్చలు జరపాలి.ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన ఇతర దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి.జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లకు చలో హైదరాబాద్ కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పిస్తూ సన్నాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీజీఈజేఏసీ నాయకులు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు వ్యక్తిగత సమస్యలు కాదని, లక్షలాది కుటుంబాలకు సంబంధించినవని పేర్కొన్నారు.సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్--మహా ధర్నా'కు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని టీజీఈజేఏసీ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పాలకుర్తి సదానందం, కోశాధికారి అంచ కిరణ్‌కుమార్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తాటికాయల కుమార్, సుజన్ ప్రసాద్, ఎస్ టి యు జిల్లా అధ్యక్షుడు మధు లేమియా, టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్, జిల్లా అధ్యక్షుడు గోవిందరావు, మహేందర్‌రెడ్డి, టి పి టి ఎఫ్ తాళ్లపల్లి రాజు, పంచాయతీ సెక్రటరీ ఫోరం రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, సిటీ అధ్యక్షుడు శంకేషి రాజేష్, స్టేట్ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ అధ్యక్షుడు కల్లెపు సదానందం, వర్ధన్నపేట మండల పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షుడు హుస్సేన్, శ్రీకర్ తదితరులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 6 గ్యారెంటీలు.. "420 హామీలు ఏమయ్యాయి

- వెయ్యి రోజుల పాలనలో హామీలు అమలు కాలేదు
- బాకీ కార్డుతో బీఆర్ఎస్ పోరుబాట
- వెయ్యి రోజుల పాలనలో హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారు
- వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్



**పర్వతగిరి ప్రతినిధి, సెప్టెంబర్ 7,తరంగాలు** : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ఆరోపించారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ చేపట్టిన వారం రోజుల పోరుబాటలో భాగంగా పర్వతగిరి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ.. రైతుబంధు రూ.15 వేలకు పెంపు, కౌలు రైతులకు ఆర్థిక సాయం, రూ.2 లక్షల రుణమాఫీ, రైతు బీమా, పంట బీమా, ధాన్యానికి రూ.500 బోనస్ వంటి హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500, కళ్యాణలక్ష్మికి తులం బంగారం, రూ.4 వేల పెన్షన్, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్ వంటి హామీలను కూడా ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు.హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి వేధించడం సరికాదని ఆయన అన్నారు. కేసులకు భయపడొద్దని, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అరూరి రమేష్ స్పష్టం చేశారు. ప్రజల హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వరరావు, పిఎసిఎస్ చైర్మన్ మనోజ్ గౌడ్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ జితేందర్ రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఏకాంతం గౌడ్, యుగేందర్ రావు, చీమల బిక్షపతి, మాజీ ఎంపీటీసీ రాజు, మండల సర్పంచులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సోషల్ మీడియాలో తల్వార్‌తో విన్యాసాలు

- కేసు నమోదు చేసిన టూటౌన్ ఎస్ఐ రమేష్
- పుట్టినరోజు వేడుకల పేరుతో ఆయుధాల ప్రదర్శన చేస్తే కఠిన చర్యలు



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** పుట్టినరోజు వేడుకల సందర్భంగా తల్వార్‌లు, కత్తులు వంటి ఆయుధాలతో విన్యాసాలు చేస్తూ వాటిని వీడియోలుగా చిత్రీకరించి సోషల్ మీడియా వేదికల్లో పోస్టు చేస్తున్న ఘటన పై ముగ్గురిపై ఇన్స్పెక్టర్ బాలకృష్ణ ఆదేశాల మేరకు ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఇటువంటి వీడియోలను పోలీసు సోషల్ మీడియా బృందం పరిశీలించి, ఘటనకు సంబంధించిన నగరానికి చెందిన షేక్ ఖాదర్, సయ్యద్ సమీర్, ఖమ్మం రూరల్ మండలం కు చెందిన షేక్ సమీర్ అనే ముగ్గురు వ్యక్తులను గుర్తించి చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో ఆయుధాల ప్రదర్శన చేయడం, ప్రమాదకరంగా విన్యాసాలు చేయడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించడం ఏమాత్రం సహించబోమని ఎస్సై హెచ్చరించారు.పుట్టినరోజు వేడుకలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని,ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా రోడ్లపై వేడుకలు నిర్వహించడం, ఆయుధాలతో విన్యాసాలు చేయడం, వాటిని వీడియోలుగా చిత్రీకరించి సోషల్ మీడియాలో ప్రచారం చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు.

సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోల ఆధారంగా కూడా పోలీసుల దృష్టికి వచ్చిన ఘటనలపై విచారణ చేపట్టి, నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# తాతా మధు వ్యాఖ్యలపై వరంగల్ లో ఆగ్రహజ్వాలలు

- పోచమ్మ మైదాన్‌లో దిష్టిబొమ్మ దహనం..

తాతా మధును

- వెంటనే సస్పెండ్ చేయడం తో పాటు బహిరంగ క్షమాపణ చెప్పించాలి
- డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్



**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 7,తరంగాలు :** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. టీపీసీసీ ఆదేశాల మేరకు వరంగల్‌లోని పోచమ్మ మైదాన్ సెంటర్‌లో డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసి, ఆయనపై బీఆర్ఎస్ పార్టీ తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవిలో ఉన్న స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి శాసనసభ స్పీకర్‌గా ఉన్నత స్థానంలో కొనసాగడాన్ని జీర్ణించుకోలేకనే ఇలాంటి వ్యాఖ్యలకు దిగుతున్నారని ఆరోపించారు.ప్రజా సమస్యలపై చర్చించాల్సిన ప్రజాప్రతినిధులు వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని స్పష్టం చేశారు.తాతా మధుపై బీఆర్ఎస్ పార్టీ వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజలకు మరియు స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని అయూబ్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల, టౌన్, డివిజన్ అధ్యక్షులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



THARANGALU DAILY NEWS
మంగళవారం, 08 సెప్టెంబర్ , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## తాతా మధును బర్తరఫ్ చేయాలి

- శాసనసభ గౌరవాన్ని కాపాడాలి..
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు క్షమాపణ చెప్పాలి: కూన శ్రీశైలం గౌడ్




హైదరాబాద్, సెప్టెంబర్ 7, తరంగాలు : తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవిలో ఉన్న శాసనసభాపతిపై ఒక శాసనమండలి సభ్యుడు ఈ విధంగా వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా అభ్యంతరకరమని ఆయన అన్నారు. ముఖ్యంగా దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.శాసనసభాపతి పదవి పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం, హుందాతనం పాటించాలని శ్రీశైలం గౌడ్ సూచించారు. ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయంలో తాతా మధు చేసిన వ్యాఖ్యలు శాసన వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.తాతా మధుపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుని ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు తాతా మధు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని కోరారు.రాజ్యాంగ పదవుల గౌరవాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థల ప్రతిష్ఠను కాపాడేందుకు ఈ వ్యవహారంపై శాసనసభ, శాసనమండలి సంబంధిత వర్గాలు తగిన చర్యలు తీసుకోవాలని కూన శ్రీశైలం గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ హౌస్ అరెస్ట్

**విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా..? కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన బీజేపీ నేత**



వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 7,తరంగాలు : విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు పిలుపు మేరకు చేపట్టిన "చలో అసెంబ్లీ" కార్యక్రమాన్ని అడ్డుకోవడంపై బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.చలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొనకుండా అడ్డుకునేందుకు మిల్స్ కాలనీ పోలీసులు శివనగర్‌లోని తన నివాసంలో తనను హౌస్ అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని ఆయన మండిపడ్డారు. ప్రతిపక్షాల ప్రజా ఉద్యమాలను పోలీసు బలగాలతో అణచివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు.

**"అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు"**

రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను పరిష్కరించకుండా ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తోందని గంట రవికుమార్ విమర్శించారు. విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రజల సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణచివేయడం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోలేరని ఆయన హెచ్చరించారు. ఎన్ని నిర్బంధాలు, అరెస్టులు ఎదురైనా విద్యార్థుల పక్షాన బీజేపీ పోరాటం ఆగదని, సమస్య పరిష్కారమయ్యే వరకు క్షేత్రస్థాయిలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు."విద్యార్థుల భవిష్యత్తు కోసం చేస్తున్న పోరాటాన్ని అడ్డుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదు. ప్రజాస్వామ్య హక్కులను గౌరవించి, విద్యార్థుల బకాయిలను వెంటనే విడుదల చేయాలి" అని గంట రవికుమార్ డిమాండ్ చేశారు.



## తాతా మధుసూదన్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి.. ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలి
- వర్ధన్నపేట పట్టణ, మండల అధ్యక్షులు ఈగ దామోదర్, పోశాల వెంకన్న గౌడ్



వర్ధన్నపేట ప్రతినిధి , సెప్టెంబర్ 7,తరంగాలు :తాతా మధుసూదన్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని వర్ధన్నపేట పట్టణ, మండల అధ్యక్షులు ఈగ దామోదర్, పోశాల వెంకన్న గౌడ్ డిమాండ్ చేశారు.తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ వర్ధన్నపేట పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో భారీ ధర్నా నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ దామోదర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఈగ దామోదర్ మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌పై తీవ్ర పదజాలంతో వ్యాఖ్యలు చేయడం బీఆర్ఎస్ అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. తాతా మధుసూదన్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్ మాట్లాడుతూ, దళితులను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. తాతా మధుసూదన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని, ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా ఖండిస్తూ, భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 6 గ్యారంటీలు.. 420 హామీల అమలేది?





- కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వర్ధన్నపేటలో బీఆర్ఎస్ ధర్నా
- "వర్ధన్నపేటలో ఎమ్మార్వో, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు.. అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా"

వర్ధన్నపేట ప్రతినిధి , సెప్టెంబర్ 7,తరంగాలు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే రమేష్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం వర్ధన్నపేటలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మండలంలోని ఎమ్మార్వో, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్‌లకు వినతిపత్రాలు అందజేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ప్రకటించిన 6 గ్యారంటీలు, 420 హామీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, 1000 రోజులు గడిచినా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. హామీలను తక్షణమే అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.అలాగే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి హాజరుకాకుండా అడ్డుకుని అక్రమంగా అరెస్టు చేశారంటూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వర్ధన్నపేట అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తుళ్ల కుమారస్వామి, పట్టణ అధ్యక్షుడు గోధుమల మధుసూదన్, మాజీ జెడ్పీటీసీ మార్గం బిక్షపతి, మాజీ మార్కెట్ చైర్మన్ గుజ్జ సంపత్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ గుజ్జ వీరన్న, తుమ్మల శ్రీధర్, సిల్వర్ కుమారస్వామి, తిరుపతి సురేష్, సింగరమైన రాజశేఖర్, భానోత్ నవీన్, దుగ్యాల మాధవరావు, అంగోత్ బిక్షపతి, తోటకూరి రాజమణి, పూజారి రఘు, కొందటి దేవేందర్, వంశీ, మాజీ ప్రధాన కార్యదర్శి కొండేటి శ్రీనివాస్, పిట్టల రాజు, భూక్యా రామన్న, వసంత్ రమేష్ నాయక్, కందుగుల నర్సయ్య, భూక్యా లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## స్పీకర్‌ను అవమానిస్తే సహించం

- కఠిన చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- స్పీకర్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలు ముమ్మాటికీ కుట్రే..
- బీఆర్ఎస్ సభ్యులను శాశ్వతంగా సస్పెండ్ చేయాలి
- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలపై అసెంబ్లీలో వాడీవేడి చర్చ




హైదరాబాద్, సెప్టెంబర్ 7,తరంగాలు ప్రతినిధి : శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలపై అసెంబ్లీలో వాడీవేడి చర్చ జరిగింది. స్పీకర్ పదవిని అవమానించేలా వ్యాఖ్యలు చేసిన సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు డిమాండ్ చేశారు.తాతా మధు చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ కుట్రపూరితమైనవేనని కేఆర్ నాగరాజు ఆరోపించారు. దొరతనం, దొర అహంకారాన్ని దించాల్సిన అవసరం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. స్పీకర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, స్పీకర్‌ను అవమానించిన సభ్యుడిపై చర్యలు తీసుకోవాలని నాగరాజు డిమాండ్ చేశారు. తాతా మధు వ్యవహరించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందని ఆయన విమర్శించారు.స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇద్దరు సభ్యుల వ్యాఖ్యలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, వారిని సభ నుంచి శాశ్వతంగా సస్పెండ్ చేయాలని కేఆర్ నాగరాజు కోరారు. సంబంధిత సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు ఇతర చట్టాల కింద కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే ఈ వ్యవహారంలో కేసు నమోదు చేస్తే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఏ1గా, కేటీఆర్, హరీశ్‌రావులను ఏ2, ఏ3గా చేర్చాలని డిమాండ్ చేశారు. బీఎన్ఎస్ చట్టంలోని 16(2) కింద కేసు నమోదు చేయడంతో పాటు, 196, 197 సెక్షన్లను, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలోని సంబంధిత నిబంధనలను వర్తింపజేయాలని ఆయన కోరారు.శాసనసభలో స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్చ జరుగుతున్న సమయంలో బీజేపీ ఎమ్మెల్యేలు అడ్డుకుంటున్నారని కేఆర్ నాగరాజు ఆరోపించారు. బీజేపీ ఎమ్మెల్యేలు అసలు అంశాన్ని పక్కదారి పట్టించేలా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు.బీజేపీలో దళిత ఎమ్మెల్యేలు లేకపోవడంతో దళితుల సమస్యలపై ఆ పార్టీకి పట్టింపు లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న ప్రదేశాన్ని శుద్ధి చేసిన ఘటనను ప్రస్తావిస్తూ, అది బీజేపీ సంస్కృతికి నిదర్శనమని ఆయన విమర్శించారు.

సభాపతి ఒక దళితుడు అయినప్పటికీ ఆయనను గౌరవించే పరిస్థితి లేకుండా, చైర్‌ను అవమానించే విధంగా ఇద్దరు సభ్యులు మాట్లాడారని నాగరాజు ఆరోపించారు. వారి వ్యాఖ్యలను సభ రికార్డుల ద్వారా పరిశీలించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

బీజేపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే స్పీకర్‌కు జరిగిన అవమానంపై చర్చకు సహకరించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కేఆర్ నాగరాజు కోరారు. అయితే బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం కారణంగానే అసలు అంశాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.బయట బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఒప్పందం చేసుకుని, సభలో అంశాన్ని డైవర్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. స్పీకర్‌పై జరిగిన అవమానంపై చర్చ జరగకుండా బీజేపీ ఎమ్మెల్యేలు వ్యవహరించడం పట్ల నాగరాజు అభ్యంతరం వ్యక్తం చేశారు.

సభ్యులకు ఏదైనా భంగం కలిగితే వారిని కాపాడాల్సిన స్పీకర్‌పైనే ఇద్దరు సభ్యులు అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని కేఆర్ నాగరాజు అన్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇద్దరు సభ్యులపై చర్యలు తీసుకుని, వారిని శాశ్వతంగా సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఇదే సమయంలో బీఆర్ఎస్ నాయకులు పోలీసులపై ప్రవర్తించిన తీరుపైనా చర్యలు తీసుకోవాలని నాగరాజు కోరారు. శాసనసభ గౌరవాన్ని, స్పీకర్ పదవి ప్రతిష్ఠను కాపాడేందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

## తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయాలి ..



ఐనవోలు, సెప్టెంబర్ 7, (తరంగాలు ప్రతినిధి ): అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అసభ్యకర పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ పార్టీ, దళిత సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఐనవోలు మండల కేంద్రంలోని నంది సెంటర్ వద్ద దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు.వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నగరకంటి మోహన్ గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు యాకార సాంబయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులతో దళిత వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్ అసెంబ్లీ స్పీకర్‌గా ఉన్నారని, ఆయనపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం దళిత సమాజాన్ని అవమానించడమేనని అన్నారు. తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వానికి, అసెంబ్లీకి ఆటంకం కలిగించే విధంగా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. ప్రజాపాలనకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. సంబంధిత నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జేబీఎం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు జన్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, అనుబంధ సంఘాల నాయకులు, వార్డు సభ్యులు, దళిత, బహుజన సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
మంగళవారం, 08 సెప్టెంబర్ , 2026


# భారత్ టైటిల్ ఫేవరేట్‌గా కనిపిస్తోంది



మహిళల ఆసియా కప్ 2026 టోర్నీలో హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని భారత జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. లీగ్ దశలో మూడు మ్యాచ్‌లకు మూడు గెలిచిన భారత్.. గ్రూప్-ఏ టాపర్‌గా నిలిచింది. గ్రూప్-బీ రన్నరప్‌తో సెమీఫైనల్ మ్యాచ్ ఆడనుంది. గ్రూప్-బీ రన్నరప్‌గా బంగ్లాదేశ్ నిలిచే అవకాశం ఉంది. అయితే ఆ జట్టుకు యూఏఈతో గట్టి పోటీ నెలకొంది. ఈ రెండు జట్ల మధ్య మంగళవారం జరిగే మ్యాచ్ ఫలితంతో భారత్ సెమీస్ ప్రత్యర్థి ఎవరో తేలిపోనుంది.గత చరిత్ర చూసుకున్నా.. ఫామ్ పరిశీలించినా.. భారత్ టైటిల్ ఫేవరేట్‌గా కనిపిస్తోంది. అయితే ఈ టోర్నీలో భారత్ విజేతగా నిలిచినా.. ట్రోఫీ దక్కే పరిస్థితులు కనిపించడం లేదు. ఎందుకంటే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ మోహ్సిన్ నఖ్వీ.. ఆసియా క్రికెట్ కౌన్సిల్(ఏసీసీ) ఛైర్మన్ హోదాలో ఫైనల్ మ్యాచ్‌కు చీఫ్ గెస్ట్‌గా హాజరుకానున్నాడు. అతనే మహిళల ఆసియా కప్ 2026 విజేతకు ట్రోఫీ అందజేయనున్నాడు. ఈ విషయంపై అధికారిక సమాచారం లేకపోయినప్పటికీ.. చీఫ్ గెస్ట్ మోహ్సిన్ నఖ్వీనే అంటూ వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. గతేడాది పురుషుల ఆసియా కప్ 2025 ఫైనల్ మోహ్సిన్ నఖ్వీ కారణంగా రసాభాసగా మారిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన భారత్.. నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకునేందుకు నిరాకరించింది. మరోవైపు నఖ్వీ కూడా తనే ట్రోఫీని అందజేస్తానని పట్టుబట్టాడు. అంతేకాకుండా ట్రోఫీని తనవెంట తీసుకెళ్లిపోయాడు. దాంతో భారత ఆటగాళ్లు ట్రోఫీ లేకుండానే సంబరాలు చేసుకున్నారు. ఇప్పటికీ ఆ ట్రోఫీ ఏసీసీ కార్యాలయంలోనే ఉంది. బీసీసీఐ ఎన్నిసార్లు డిమాండ్ చేసినా మోహ్సిన్ మాత్రం వెనక్కి తగ్గలేదు. మహిళల ఆసియా కప్ ఫైనల్ అనంతరం కూడా ఇవే పరిస్థితులు పునరావృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సెప్టెంబర్ 13న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. భారత్ విజేతగా నిలిస్తే మాత్రం.. నఖ్వీ చేతుల మీదు టైటిల్ తీసుకోదు. అదే జరిగితే మరోసారి ట్రోఫీ లేకుండానే భారత్ విజేతగా స్వదేశానికి రావాల్సి ఉంటుంది. ఏం జరుగుతుందో చూడాలి. భారత్ చేతిలో చిత్తుగా ఓడిన పాకిస్థాన్.. సెమీస్ బెర్త్ కోసం తండ్లాడుతోంది. నేడు (సోమవారం) హాంగ్‌కాంగ్‌తో జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో విజయం సాధిస్తేనే పాక్ సెమీస్ చేరనుంది. లేదంటే ఇంటిబాట పడుతోంది.

# ఇండస్ట్రీకి గుడ్ బై చెప్పేస్తుందా?



లేడీ సూపర్ స్టార్ గా తనకంటూ చెరగని ముద్ర వేసుకున్న కథానాయిక అనుష్క శెట్టి. -అరుంధతి-, -భాగమతి-, -బాహుబలి- వంటి భారీ చిత్రాలతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న స్వీటీ గత కొంతకాలంగా వెండితెరకు.. మీడియా ప్రమోషన్లకు దూరంగా ఉండటం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అమ్మడు నటించిన చిత్రాలు విడుదలవుతున్నా? ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం అనుష్క నటనా జీవితానికి ముగింపు పలకాలనే ఆలోచనలో ఉన్నట్లు పరిశ్రమలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అనుష్క మలయాళంలో తెరకెక్కుతోన్న భారీ బడ్జెట్ జానపద చిత్రం -కథనార్: ది విల్డ్ సోర్సరర్- లో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రం ఫలితంపైనే అనుష్క భవిష్యత్తు ప్రణాళికలు ఆధారపడి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో క్రమం తప్పకుండా వరుస సినిమాలు చేసిన అనుష్క ఇటీవల కాలంలో కథల ఎంపికలో అత్యంత జాగ్రత్త వహిస్తున్నారు. మనసుకు నచ్చిన, ప్రాధాన్యత ఉన్న పాత్రలకు మాత్రమే ఓకే చెబుతున్నారు. అయితే సినిమాల ఎంపిక తగ్గించడంతో పాటుగా ఆయా చిత్రాల ప్రచార వేదికలపై ఆమె కనిపించకపోవడం అభిమానులను కలవరపెడుతోంది. పర్సనల్ లైఫ్, ఫిట్‌నెస్ లైఫ్‌స్టైల్‌పై దృష్టి పెట్టడం వల్లే ఆమె గ్లామర్ ప్రపంచానికి కాస్త విరామం ఇచ్చారని కొందరు విశ్లేషిస్తున్నారు. -కథనార్- చిత్రం పాన్-ఇండియా స్థాయిలో అత్యంత అట్టహాసంగా విడుదల కానుంది. ఈ సినిమా కనుక బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని సాధిస్తే అనుష్క కెరీర్‌ను మరికొంత కాలం కొనసాగించే అవకాశం ఉందంటున్నారు. ఒకవేళ ప్రాజెక్ట్ ఫలితం తారుమారైతే స్వీటీ పూర్తిస్థాయిలో చిత్ర పరిశ్రమకు గుడ్ బై చెప్పి, వ్యక్తిగత జీవితానికే ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నట్లు ప్రచారం మొదలైంది. అనుష్క శెట్టి గ్లామర్ పాత్రలకే పరిమితం కాలేదు. లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద హీరోలకు సమానంగా వసూళ్లు రాబట్టిన నటి. టాలీవుడ్, కోలీవుడ్‌లలో తిరుగులేని ఇమేజ్‌ను సంపాదించుకున్న అమ్మడు పరిశ్రమను వీడుతున్నారనే వార్తలు అభిమానులను నిరాశకు గురి చేస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా స్వీటీ తిరిగి పూర్తిస్థాయిలో సినిమాలు చేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఏది ఏమైనా? -కథనార్- చిత్రం విడుదలయ్యే వరకు ఈ ప్రచారాలపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. అనుష్క నిర్ణయం ఏదైనా? అమ్మడు మళ్లీ పూర్వ వైభవంతో వెండితెరపై మెరవాలని.. మరిన్ని పవర్‌ఫుల్ పాత్రలతో ప్రేక్షకులను అలరించాలని అభిమానులు మాత్రం బలంగా కోరుకుంటున్నారు.



# ఇషాన్ కిషన్ డబుల్ సెంచరీ

## దులీప్ ట్రోఫీ ఫైనల్లో అరుదైన చరిత్ర



దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఇషాన్ కిషన్ చరిత్ర సృష్టించాడు. ఈస్ట్ జోన్ తరఫున కెప్టెన్‌గా బరిలోకి దిగిన అతడు అద్భుతమైన డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. సౌత్ జోన్‌తో జరుగుతున్న ఫైనల్లో సోమవారం రెండో రోజు ఆటలో 200 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. ఆదివారం ఆట ముగిసే సమయానికి ఇషాన్ 111 పరుగులతో అజేయంగా ఉన్నాడు. రెండో రోజు కూడా అదే జోరు కొనసాగించాడు. ఈ డబుల్ సెంచరీతో దులీప్ ట్రోఫీ ఫైనల్లో 200 పరుగులు చేసిన ఐదో బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు ఈ ఘనత సాధించిన వారిలో రమణ్ లాంబా, అన్షుమన్ గైక్వాడ్, ఛటేశ్వర్ పుజారా, యశస్వి జైస్వాల్ ఉన్నారు. 1987-88 సీజన్‌లో రమణ్ లాంబా 320 పరుగులతో అత్యధిక స్కోరు నమోదు చేశాడు. అదే సీజన్‌లో అన్షుమన్ గైక్వాడ్ 216 పరుగులు చేశాడు. 2016-17లో పుజారా 256 పరుగులతో అజేయంగా నిలిచాడు. 2022-23లో యశస్వి జైస్వాల్ 209 పరుగులు చేశాడు. మొదటి రోజు ఇషాన్, కుమార్ కుశాగ్ర కలిసి ఈస్ట్ జోన్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపారు. వీరిద్దరూ 26.4 ఓవర్లలో 144 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. రోజు ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ 385/4తో నిలిచింది. రెండో రోజు కుశాగ్ర కూడా సెంచరీ పూర్తి చేసి ఔటయ్యాడు. అయినా ఇషాన్ ఇన్నింగ్స్‌పై దాని ప్రభావం పడలేదు. ఈ డబుల్ సెంచరీతో ఇషాన్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 4,000 పరుగుల మైలురాయిని కూడా దాటాడు. ఇదే ఫార్మాట్‌లో అతడికి ఇది 10వ సెంచరీ. సుదీర్ఘ ఫార్మాట్‌లో తన స్థానాన్ని తిరిగి సాధించేందుకు ఇషాన్ చేస్తున్న ప్రయత్నాలకు ఈ ఇన్నింగ్స్ మరింత బలాన్నిచ్చింది. ఈస్ట్ జోన్ చివరిసారిగా 13 ఏళ్ల క్రితం దులీప్ ట్రోఫీని గెలిచింది. ప్రస్తుత ఫైనల్లో ఆ జట్టు ఆధిపత్యంలో ఉంది. బౌలర్లు రాణిస్తే రెండోసారి బ్యాటింగ్ చేయకుండానే టైటిల్ గెలిచే అవకాశం ఉంది.

## 'రంభ ఊర్వశి మేనక' కలెక్షన్స్ జోరు




ఈమధ్య సీరియస్ రోల్స్, ఇంటెన్స్ డ్రామాలు చేస్తూ వచ్చిన అల్లరి నరేష్.. మళ్లీ తన సొంత ట్రాక్ అయిన ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్ వైపు అడుగులేశారు. ఆడియన్స్ కూడా ఆయన నుంచి ఎక్కువగా ఆశించేది వింటేజ్ కామెడీ టైమింగే కావడంతో లేటెస్ట్ మూవీ 'రంభ ఊర్వశి మేనక'పై రిలీజ్ ముందే క్రేజ్ ఏర్పడింది. ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో అవుట్ అండ్ అవుట్ కామెడీ ట్రాక్ లో ఈ సినిమా థియేటర్లలోకి వచ్చింది. మొదటి రోజు మార్నింగ్ షోస్ పడగానే కొన్ని చోట్ల మిక్స్‌డ్ టాక్ వినిపించినప్పటికీ, సినిమాలోని ఫన్ ఎలిమెంట్స్ కుర్రాళ్లతో పాటు ఫ్యామిలీస్ కి కనెక్ట్ అవ్వడం మొదలైంది. రొటీన్ కమర్షియల్ మాస్ సినిమాల మధ్య కాసేపు రిలాక్స్ అయి హాయిగా నవ్వుకునే స్పేస్ దొరకడంతో నెమ్మదిగా మౌత్ టాక్ బలపడింది. ముఖ్యంగా శనివారం, ఆదివారం నాటికి బీ, సీ సెంటర్లలో కూడా ఈవెనింగ్ షోలకు ఆక్యుపెన్సీలు మెరుగవుతూ వచ్చాయి. ఈ పాజిటివ్ వర్డ్ ఆఫ్ మౌత్ బాక్సాఫీస్ కలెక్షన్లలో కనిపిస్తోంది. మొదటి మూడు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 4.40 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి డీసెంట్ వీకెండ్ నంబర్లను నమోదు చేసింది. మిక్స్‌డ్ టాక్ ప్రభావం కొంత ఉన్నప్పటికీ ఈ స్థాయి వసూళ్లు రాబట్టడం మామూలు విషయం కాదు. అల్లరి నరేష్ టైమింగ్‌కి, కామెడీ జానర్‌కు ఇంకా ఆ క్రేజ్ తగ్గలేదని చెప్పవచ్చు. సినిమాలో స్వర్గలోకం నేపథ్యం, రంభ, ఊర్వశి, మేనకలుగా కనిపించిన నటీమణులతో నరేష్ చేసిన కామెడీ ట్రాక్స్ కూడా హైలెట్ అయ్యాయి. లాజిక్కులు వెతక్కుండా కేవలం ఎంటర్‌టైన్‌మెంట్‌ను మాత్రమే ఎంజాయ్ చేసే ఆడియన్స్‌కు ఈ కంటెంట్ బాగా రీచ్ అయింది. చైతన్ భరద్వాజ్ అందించిన మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఆ ఫన్ మూడ్‌ను నిలబెట్టడంలో సాయపడ్డాయి. కథ పరంగా కన్ఫ్యూజన్ ఏమి లేదు, రన్‌టైమ్ తక్కువగా ఉండటం, నరేష్ తన మార్క్ కామెడీతో నెట్టుకురావడం సినిమాకు కలిసొచ్చింది. దర్శకుడు చంద్రమోహన్ నరేష్ కు తగ్గ ఫన్ ను క్రియేట్ చేశాడు, హాస్య మూవీస్ నిర్మాణ విలువలు సినిమా స్కేల్‌కు సరిపోయేలా ఉన్నాయి. పెద్దగా హంగులకు పోకుండా కేవలం ఫన్ ట్రాక్స్‌పైనే ఫోకస్ పెట్టడంతో బాక్సాఫీస్ వద్ద వీకెండ్ వరకు ఒక మోస్తరుగా నిలబడగలిగింది. అయితే చిత్రానికి అసలైన ఛాలెంజ్ సోమవారం నుంచే మొదలవుతోంది. వీకెండ్‌లో వచ్చిన డీసెంట్ నంబర్స్ మిక్స్‌డ్ టాక్ ఉన్న సినిమాలకు వర్కింగ్ డేస్‌లో కంటిన్యూ అవ్వడం అంత సులువు కాదు. ఇక రాబోయే రోజుల్లో ఈ సినిమా ఎలాంటి కలెక్షన్స్ అందుకుంటుందో చూడాలి.

## 'ది ప్యారడైజ్' విడుదల వాయిదా?



నేచురల్ స్టార్ నాని కథా నాయకుడిగా నటిస్తున్న యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' విడుదల తేదీపై మళ్లీ నీలినీడలు కమ్ముకున్నాయి. ముందుగా ప్రకటించిన ప్రకారం సెప్టెంబర్ 24న ఈ చిత్రాన్ని విడు దల చేయాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడే అవకా శం ఉందని టాలీవుడ్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో జాప్యం కారణంగా సినిమాను అక్టోబర్ 1వ తేదీకి మార్చాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, 'ది ప్యారడైజ్' క్లైమాక్స్‌లో భారీ స్థాయిలో వీఎఫ్ఎక్స్, సీజీ వర్క్ ఉంది. ఈ గ్రాఫిక్స్ పనులు అనుకున్న సమయానికి పూర్తి కావడం లేదని, అందుకే విడుదల తేదీని వాయిదా వేయాలనే ఆలోచనలో ఉన్నారని అంటున్నారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి ఒక్క క్లైమాక్స్ సీజీ వర్క్ కోసమే సుమారు రూ.2 కోట్లు ఖర్చు చేస్తున్నారని, నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదనే ఉద్దేశంతోనే ఈ జాప్యం జరుగుతోందని సమాచారం. ఒకవేళ ఈ సినిమా అక్టోబర్ 1కి వాయిదా పడితే, బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొననుంది. నాగవంశీ నిర్మించిన 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' అక్టోబర్ 2న విడుదల కానుంది. విశేషమేమిటంటే, 'ది ప్యారడైజ్' నైజాం హక్కుల్లో నాగ వంశీకి 25 శాతం వాటా ఉంది. గతంలో 'ది ప్యారడైజ్' కోసం ఆయన తన సినిమాను వాయిదా వేసుకున్నారు. ఇప్పుడు ఈ రెండు చిత్రాలు దాదాపు ఒకేసారి విడుదలయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. అక్టోబర్ రెండో వారంలో విజయ్ దేవరకొండ 'రణబాలి', సూపర్ స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2' వంటి పెద్ద సినిమాలు కూడా రానుండటంతో పోటీ మరింత తీవ్రంగా ఉండనుంది. ఇప్పటికే 'ప్యారడైజ్' సినిమా రెండుసార్లు వాయిదా పడింది. తొలుత మార్చి 26, ఆ తర్వాత ఆగస్టు 21 తేదీలను ప్రకటించి, చివరకు సెప్టెంబర్ 24ను ఖరారు చేశారు. ఇప్పుడు మరోసారి వాయిదా పడితే ఇది మూడోసారి అవుతుంది. ఇది డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది.